క్లుప్తంగా

ఎమ్మెల్యే పరామర్శ



సర్పంచ్ కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే జోగులు

వంగర: మండలంలోని బాగెంపేట సర్పంచ్ రెడ్డి సత్యవతి తల్లి బొమ్మి నారాయణమ్మ ఇటీవల మృతి చెందారు. ఈ మేరకు బాధిత కుటుంబాన్ని ఎమ్మెల్యే కంబాల జోగులు సోమవారం కలిసి పరామర్శించారు. అనంతరం ఆమె మృతికి గల కారణాలు అడిగి తెలుసుకుని, ప్రగాఢ సానుభూతి తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ ఉత్తరావెల్లి సురేష్‌ముఖర్జీ, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ కరణం సుదర్శనరావు, తెంటు జోగునాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలకు కృతజ్ఞతలు



ఎమ్మెల్సీ విక్రాంత్‌ను కలిసి కృతజ్ఞతలు తెలుపుతున్న సంకిలి పీఏసీఎస్ చైర్మన్ వెంకటవేణుగోపాలనాయుడు

రేగిడి: తనను మండలంలోని సంకిలి ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం(పీఏసీఎస్) చైర్మన్‌గా ఎంపిక చేసేందుకు గాను ఎమ్మెల్యే కంబాల జోగులు, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్‌లకు లావేటి వెంకటవేణుగోపాలనాయుడు కృతజ్ఞతలు తెలిపారు. సోమవారం పాలకొండ పట్టణంలో నివాసముంటున్న ఎమ్మెల్సీని సోమవారం కలిసి, ధన్యవాదాలు చెబుతూ మీరు నాపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని, సొసైటీ అభివృద్ధి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ పుర్లి సత్యవతి తదితరులు పాల్గొన్నారు.

ఏపీయూడబ్ల్యూజే జిల్లా సహాయ కార్యదర్శిగా నీల కంఠేశ్వర్ యాదవ్



రాజాం: ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్(ఏపీయూడబ్ల్యూజే)ల సంఘం జిల్లా సహాయ కార్యదర్శిగా రాజాం ప్రాంతానికి చెందిన ఉల్లాకుల నీలకంఠేశ్వర్ యాదవ్ ఎంపికయ్యారు. ఈ నెల 6వ తేదీన విజయనగరం జిల్లా పరిషత్ కార్యాలయంలో జరిగిన 26వ మహాసభల్లో సంఘ నూతన కార్యవర్గం ఏర్పాటు జరిగింది. సంఘ నూతన అధ్యక్షుడిగా అల్లు సూరిబాబు ఎంపిక కాగా, సహాయ కార్యదర్శిగా తనను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారని యాదవ్ సోమవారం తెలిపారు. ఈ సందర్భంగా యాదవ్‌ను యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు ఐవీ సుబ్బారావు, జిల్లా అధ్యక్షుడు అల్లు సూరిబాబు, రాజాం పట్టణానికి చెందిన పలువురు జర్నలిస్టులు అభినందనలు తెలిపారు.


అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే భూమిపూజ



అభివృద్ధి పనులకు భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే శంబంగి

బొబ్బిలి: మున్సిపాలిటీ పరిధిలోని 10, 27వ వార్డుల్లో పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు సోమవారం భూమిపూజ చేశారు. దాదాపు రూ.13 లక్షల వ్యయంతో సీసీ రోడ్లు, డ్రైనేజీలు నిర్మిస్తున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. రాష్ట్ర సమగ్రాభివృద్ధి, ప్రజాసంక్షేమమే వైఎస్సార్ సీపీ ప్రభుత్వ ధ్యేయమన్నారు. వచ్చే ఎన్నికల్లోనూ సీఎం జగనన్ననే మళ్లీ ముఖ్యమంత్రిని చేయాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఎస్వీ మురళీ కృష్ణారావు, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు శంబంగి వేణుగోపాలనాయుడు, మున్సిపల్ కమిషనర్ ఎస్.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

మెర్సీవాల్ ప్రారంభం



మెర్సీవాల్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శంబంగి

బొబ్బిలి: స్థానిక తహసీల్దారు కార్యాలయం ఆవరణలో ఏర్పాటు చేసిన మెర్సీవాల్(దయగల గోడ)ను ఎమ్మెల్యే శంబంగి వెంకటచిన అప్పలనాయుడు సోమవారం ప్రారంభించారు. మన ఇళ్లల్లో వినియోగించని వస్తువులు ఏవైనా ఉంటే వాటిని ఈ గోడ దగ్గర విడిచిపెట్టాలని, వాటిని అవసరమైన నిరుపేదలకు అందించడం జరుగుతుందని అధికారులు తెలిపారు. మనకు పనికిరాని వస్తువులు ఇతరులకు పనికి రావొచ్చని, ఇళ్లల్లో వాడని వస్తువులు ఇచ్చి, దయాహృదయులుగా నిలవాలని ఎమ్మెల్యే కోరారు. కార్యక్రమంలో ఆర్డీఓ పి.శేషశైలజ, తహసీల్దార్ రాజేశ్వరరావు, ఎంపీడీఓ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలతో..

అన్ని వర్గాలకు మేలు

- 'గడప గడపకు మన ప్రభుత్వం'లో ఎమ్మెల్యే కంబాల జోగులు



రాజాం: ఇంటింటికీ వెళ్లి, సంక్షేమ పాలనను వివరిస్తున్న ఎమ్మెల్యే కంబాల జోగులు

రాజాం: రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో అన్ని వర్గాలకు మేలు జరుగుతోందని ఎమ్మెల్యే కంబాల జోగులు అన్నారు. సోమవారం స్థానిక పట్టణ పరిధిలోని కొండంపేటలో నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే గ్రామస్తులు ఘనస్వాగతం పలికారు. అనంతరం ఇంటింటికీ వెళ్లిన ఆయన నాలుగేళ్లుగా ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమం వివరించారు. ఏవైనా సమస్యలున్నా, అర్హులై ఉండి ఎవరికైనా పథకాలు అందకపోయినా వెంటనే తెలియజేయాలన్నారు. రాష్ట్ర సమగ్రాభివృద్ధి, ప్రజాసంక్షేమమే ధ్యేయంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన చేస్తున్నారన్నారు. ఓ వైపు అభివృద్ధి పనులు చేపడుతూనే మరోవైపు నిర్విరామంగా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారన్నారు. కుల, మత, రాజకీయ పార్టీలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా ప్రతీ గ్రామంలోని ప్రతీ ఇంటికి ఏదో ఓ పథకం రూపంలో లబ్ధి చేకూరుస్తున్నారన్నారు. గతంలో ఏ ప్రభుత్వమూ అమలుచేయనన్ని పథకాలను రాష్ట్రంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. గతంలో టీడీపీకి అధికారమిస్తే ఏం చేశారని ప్రశ్నించారు. నీరు–చెట్టు పథకం పేరిట ఆ పార్టీ ప్రజాధనాన్ని దోచుకుందని విమర్శించారు. మళ్లీ ఎన్నికలు రానుండడంతో చంద్రబాబు అండ్ కో మళ్లీ మాయమాటలతో ప్రజలను మోసం చేసేందుకు సిద్ధమయ్యారని, వారి మాటలు నమ్మి మరోసారి మోసపోవద్దని హితవుపలికారు. ఇదే సంక్షేమ పాలన కొనసాగాలంటే వచ్చే ఎన్నికల్లోనూ జగనన్న ప్రభుత్వాన్నే మళ్లీ అధికారంలోకి తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ టౌన్ కన్వీనర్ పి.శ్రీనివాసరావు, పి.లక్ష్మణరావు, ఎం.సత్యారావు, మున్సిపల్ కమిషనర్ డీటీవీ కృష్ణారావు, ఏఈ వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

నేడు కొత్తవలసలో..

రాజాం మండలంలోని కొత్తవలస గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం మంగళవారం మధ్యాహ్నం నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ డీటీవీ కృష్ణారావు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎమ్మెల్యే కంబాల జోగులు పాల్గొనే ఈ కార్యక్రమానికి మండల స్థాయి పార్టీ నేతలు, కార్యకర్తలు, అధికారులు హాజరు కావాలని కోరారు.



తెర్లాం: ఆమిటిలో ఇంటింటికీ వెళ్లి, ప్రభుత్వ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే శంబంగి

అర్హతే ప్రామాణికం: ఎమ్మెల్యే శంబంగి

తెర్లాం: అర్హతే ప్రామాణికంగా, కుల, మత, రాజకీయ పార్టీలకు అతీతంగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం సంక్షేమ పథకాలు అందిస్తోందని, ఇప్పటివరకు డీబీటీ, నాన్ డీబీటీ విధానాల ద్వారా రూ.3 లక్షల కోట్లకు పైగా డబ్బులను పేదలకు పంచిపెట్టిందని ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు తెలిపారు. సోమవారం సాయంత్రం మండలంలోని ఆమిటి గ్రామంలో నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యేకు గ్రామస్తులు ఘనస్వాగతం పలికారు. అనంతరం ఇంటింటికీ వెళ్లిన ఆయన నాలుగేళ్లుగా ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పనులు, అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు వివరించారు. రాష్ట్రంలో గత నాలుగేళ్లుగా సంక్షేమ పాలన కొనసాగుతోందని, గతంలో రాష్ట్రంలోని ఏ ముఖ్యమంత్రి అమలు చేయనన్ని పథకాలను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్నారన్నారు. రాష్ట్రాభివృద్ధి, ప్రజాసంక్షేమం రెండు కళ్లుగా సీఎం జగనన్న పాలన కొనసాగిస్తున్నారని, సచివాలయ, వలంటీర్ వ్యవస్థల ద్వారా సరికొత్త పాలనకు నాంది పలికారన్నారు. రాష్ట్రంలో అమలులోని అనేక పథకాలను ఇతర రాష్ట్రాలు ఆదర్శంగా తీసుకుంటున్నాయన్నారు. 2024 సార్వత్రిక ఎన్నికల్లోనూ మళ్లీ వైఎస్సార్ సీపీనే గెలిపించాలని ఎమ్మెల్యే కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ బొబ్బిలి, తెర్లాం మండలాల అధ్యక్షులు ఎస్.వేణుగోపాలనాయుడు, ఎన్.బాబ్జీరావు, ఎంపీపీ ఎస్.ఉమాలక్ష్మి, ఎంపీడీఓ ఎస్.రామకృష్ణ, డిప్యూటీ తహసీల్దార్ జి.భాస్కరరావు, పంచాయతీ కార్యదర్శి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

వార్డు మెంబర్ల ఎన్నికకు నోటిఫికేషన్

- నేటి నుంచి నామినేషన్ల స్వీకరణ
- 19వ తేదీన పోలింగ్



బాడంగి: ఎంపీడీఓ కార్యాలయం గోడపై అతికించిన ఎన్నికల నోటిఫికేషన్‌ను చూపిస్తున్న అధికారులు

తెర్లాం: మండలంలో ఖాళీగా ఉన్న నాలుగు వార్డుల మెంబర్ల ఎన్నికకు నోటిఫికేషన్ విడుదల చేసినట్లు ఎంపీడీఓ శంబంగి రామకృష్ణ సోమవారం తెలిపారు. కొన్ని నెలల క్రితం మరణించిన వార్డు సభ్యుల స్థానంలో కొత్త వారిని ఎన్నుకునేందుకు రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాలు జారీ చేసిందని, ఈ మేరకు తాము నోటిఫికేషన్ ఇచ్చినట్లు పేర్కొన్నారు. మండలంలోని పణుకువలస పంచాయతీలో రెండు, లింగాపురం పంచాయతీ, సుందరాడ పంచాయతీల్లో ఒక్కొక్కటి చొప్పున వార్డు మెంబర్ల స్థానాలకు ఎన్నికలు జరుగుతాయన్నారు. 8 నుంచి 10వ తేదీ వరకు నామినేషన్ల స్వీకరణ, 11వ తేదీన అభ్యంతరాల స్వీకరణ, 13వ తేదీన అభ్యంతరాల పరిశీలన, 14వ తేదీన నామినేషన్ల ఉపసంహరణ, అభ్యర్థుల జాబితా ప్రకటన, 19వ తేదీన ఉదయం 7 గంటల నుంచి ఒంటిగంట వరకు పోలింగ్, మధ్యాహ్నం 2 గంటల నుంచి ఓట్ల లెక్కింపు, అనంతరం విజేతల పేర్లు ప్రకటన ఉంటుందన్నారు.

రామభద్రపురం: మండలంలోని రొంపల్లి ఏడో వార్డు మెంబరు స్థానానికి గాను ఎన్నిక నిర్వహించేందుకు ఎంపీడీఓ రమామణి సోమవారం నోటిఫికేషన్ విడుదల చేశారు. అక్కడి వార్డు మెంబరు కొన్నాళ్ల క్రితం అనారోగ్యంతో మరణించడంతో ఈ ఎన్నిక అనివార్యమైందన్నారు.

బొబ్బిలి: మండలంలోని కారాడ, శివడవలస, కొండదేవుపల్లి గ్రామ పంచాయతీల్లో ఖాళీగా ఉన్న నాలుగు వార్డు మెంబర్ల స్థానాలకు ఎన్నికకు ఎంపీడీఓ పోతుల రవికుమార్ నోటిఫికేషన్ విడుదల చేశారు.

బాడంగి: మండలంలోని పాల్తేరు గ్రామ పంచాయతీ ఆరో వార్డు మెంబర్ స్థానం ఎన్నికకు ఎంపీడీఓ ఆంజనేయులు సోమవారం నోటిఫికేషన్ విడుదల చేశారు. ఇక్కడి వార్డు మెంబర్‌గా గెలుపొందిన పూడి మాధురి వలంటీర్‌గా ఎంపిక కావడంతో ఆమె తన పదవికి రాజీనామ చేశారు. దీంతో ఆ స్థానం ఖాళీ కాగా ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఎన్నికలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ తెలిపారు.

ఆమదాలవలస యువత ఆదర్శం



అనాథ వృద్ధులకు భోజనం క్యారేజీలు అందజేస్తున్న మాజీ సర్పంచ్ హేమసుందరరావు

రేగిడి: మండలంలోని ఆమదాలవలస గ్రామానికి చెందిన యువత ఆదర్శంగా నిలుస్తోంది. ప్రతీ సోమవారం గ్రామంలోని కాశీవిశ్వేశ్వరాలయ ప్రాంగణంలో భోజనాలు వండి, వాటిని క్యారేజీల్లో పెట్టి, అనాథ వృద్ధులు, నిరుపేదలకు అందజేస్తున్నారు. యువతీ, యువకుల్లో ఎవరి పుట్టినరోజు జరిగినా, ఎవరికి ఉద్యోగం వచ్చినా ఆ.. శుభసందర్భం పురస్కరించుకుని, ఈ అన్నదాన కార్యక్రమానికి ముందుకువస్తుంటారు. దాతలు అందించిన తోడ్పాటుతో కాశీవిశ్వేశ్వర యూత్ కమిటీ సభ్యులు యర్రాపాత్రుని వెంకటదుర్గాప్రసాదరావు, యర్రాపాత్రుని చంద్రవర్దన్, యర్రాపాత్రుని చిట్టిబాబు, గేదెల లక్ష్మునాయుడు, ఎస్.వెంకటరమణ, పొగిరి అమ్మాజమ్మతో పాటు మరి కొంతమంది సభ్యులు ఈ అన్నదాన కార్యక్రమం నాలుగేళ్లుగా నిర్వహిస్తూ అందరి మన్ననలు పొందుతున్నారు. వారి సేవాభావం చూసి, మిగతా యువత కూడా స్ఫూర్తి పొంది, మంచి పనులకు ముందుకురావాలని ఆకాంక్షిస్తున్నారు. ఈ సోమవారం జరిగిన అన్నదాన కార్యక్రమానికి మాజీ సర్పంచ్ యర్రాపాత్రుని హేమసుందరరావు సహాయం చేశారని, ఆయనకు కృతజ్ఞతలని సభ్యులు తెలిపారు.

వినతిపత్రం అందజేత

బొబ్బిలి: స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడును వీర బొబ్బిలి మాజీ సైనికుల సంఘం నాయకులు, సభ్యులు సోమవారం కలిశారు. ఈ సందర్భంగా వారు సంఘ కార్యాలయం నిర్మాణానికి స్థలం కేటాయించాలని విజ్ఞప్తి చేస్తూ వినతిపత్రం అందజేశారు. స్పందించిన ఎమ్మెల్యే సమస్య పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.

సకాలంలో సమస్యలు పరిష్కరించాలి

- 'జగనన్నకు చెబుదాం'లో ఎంపీడీఓ శంబంగి రామకృష్ణ

తెర్లాం: జగనన్నకు చెబుదాం(స్పందన) కార్యక్రమం ద్వారా ప్రజానీకం లేవనెత్తిన సమస్యలను మండల స్థాయి అధికారులంతా సకాలంలో పరిష్కరించాలని ఎంపీడీఓ శంబంగి రామకృష్ణ సూచించారు. సోమవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో జరిగిన మండల స్థాయి జగనన్నకు చెబుదాం కార్యక్రమానికి హాజరైన ఆయన అధికారులనుద్దేశించి కాసేపు మాట్లాడారు. స్పందన కార్యక్రమానికి వచ్చి, సమస్యల పరిష్కారానికి ప్రజలు అందిస్తున్న వినతులను స్వీకరించి, పరిశీలించాలన్నారు. అనంతరం సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని తెలిపారు. ఏదైనా సమస్య పరిష్కారం కాకపోతే ఆ సమస్య పరిష్కారం కాకపోవడానికి గల కారణాన్ని అర్జీదారుకు తెలియజేయాలన్నారు. సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వహించవద్దన్నారు.

బాడంగి: 'స్పందన' సమస్యలు ఎప్పటికప్పుడు పరిష్కరించాలని ఎంపీడీఓ ఆంజనేయులు సూచించారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో జరిగిన స్పందన కార్యక్రమంపై సమీక్షలో ఆయన మాట్లాడుతూ పంచాయతీ స్థాయిలో పరిష్కారం కాని ప్రజాసమస్యలను ఎంపీడీఓ కార్యాలయం దృష్టికి తీసుకురావాలని తెలిపారు. అధికారులు నిత్యం చిత్తశుద్ధి, నిబద్ధతతో పనిచేసి, ప్రజాసేవకులుగా మంచి గుర్తింపు పొందాలన్నారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ సూర్యనారాయణ, ఏఓ నర్సింగరావు తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా...

వరి, మొక్కజొన్న సాగుపై అవగాహన కల్పించండి

రాజాం: వరి, మొక్కజొన్న పంటల సాగుపై రైతులకు అవగాహన కల్పించాలని వ్యవసాయ శాఖ ఏడీఏ కె.చంద్రరావు సూచించారు. స్థానిక వ్యవసాయ శాఖ కార్యాలయంలో మండలంలోని ఆర్బీకేల పరిధిలో ఉన్న వీఏఏ(విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్లు)లతో సోమవారం సమావేశమైన ఆయన పంటల సాగులో మెలకువలు, పాటించాల్సిన పద్ధతులు, వాడాల్సిన ఎరువులను రైతులకు తెలపాలన్నారు. కార్యక్రమంలో రాజాం వ్యవసాయ శాఖ అధికారిణి రేణుకాసాయి తదితరులు పాల్గొన్నారు.

దుకాణాల్లో ఆకస్మిక తనిఖీలు

రాజాం: స్థానిక పట్టణంలోని పలు దుకాణాల్లో శానిటరీ ఇన్‌స్పెక్టర్ సీహెచ్ ప్రసాద్ సోమవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. వ్యాపారులు వినియోగిస్తున్న, విక్రయిస్తున్న పాలిథిన్ కవర్లను పరిశీలించి, నిషేధిత పాలిథిన్ కవర్లు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇదిలా ఉండగా, నిబంధనలు అతిక్రమిస్తూ పాలిథిన్ కవర్లు అమ్ముతున్న వారి నుంచి రూ.1400 అపరాధ రుసుం వసూలు చేశారు.

సైబర్ మోసాల బారినపడొద్దు

రేగిడి: మండలంలోని కొర్లవలస, మునకలవలస, బాలకవివలస గ్రామాల్లో లోన్ యాప్‌లు, సైబర్ మోసాల బారినపడకుండా ఉండడంపై ఎస్‌ఐ ఇ.శ్రీనివాసరావు సోమవారం అవగాహన కల్పించారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, స్మార్ట్ ఫోన్లకు వచ్చే అనవసరమైన లింకులు క్లిక్ చేసి, బ్యాంకులోని డబ్బులు పోగొట్టుకోవద్దని తెలిపారు. అలాగే లోన్ యాప్‌లను ఆశ్రయించవద్దన్నారు. ఏటీఎం పిన్, మొబైల్‌కు వచ్చే ఓటీపీలను ఎవరికీ చెప్పవద్దన్నారు. ఇవి చెబితే నష్టపోవడం ఖాయమన్నారు.

చాటాయివలసలో 'పొలంబడి'

రేగిడి: మండలంలోని చాటాయివలస గ్రామంలో వైఎస్సార్ పొలంబడి కార్యక్రమం సోమవారం నిర్వహించారు. మండల వ్యవసాయాధికారి జి.మురళీకృష్ణ వరి పంటకు ఆశించే తెగుళ్ల నివారణకు చేసే పురుగుమందు పిచికారీలో పాటించాల్సిన జాగ్రత్తలను వివరించారు. అలాగే అధిక దిగుబడులకు ఏ విధంగా వ్యవసాయం చేయాలో తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ కరణం గోవిందరావు, అగ్రికల్చర్ అసిస్టెంట్ కెంబూరు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీలే వేతనాలు చెల్లించాలి

బాడంగి: గ్రామ పంచాయతీల్లో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు సంబంధిత పంచాయతీలే వేతనాలు చెల్లించాలని జెడ్పీటీసీ పెద్దింటి రామారావు అన్నారు. సోమవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమావేశమైన ఆయన 2019లో స్వచ్ఛభారత్ మిషన్ ద్వారా కార్మికులకు వేతనాలు నేరుగా వచ్చేవని, ఏడాది కాలం నుంచి ఆ పద్ధతికి స్వస్తి చెప్పడం జరిగిందన్నారు. జనరల్ ఫండ్ ఉంటే దాని నుంచి 10 శాతం, 15వ ఆర్థిక సంఘం నిధుల నుంచి 30 శాతం నిధులు కార్మికుల వేతనాల కోసం కేటాయించే విషయంపై సర్పంచ్‌లకు అవగాహన కల్పించాలని తెలిపారు.

వరినాట్లు వేయడంపై అవగాహన

బొబ్బిలి: మండలంలోని కారాడ, మెట్టవలస గ్రామాల్లో యంత్రం ద్వారా వరినాట్లు వేయడంపై వ్యవసాయ శాఖ ఏడీ మజ్జి శ్యామసుందర్ సోమవారం అవగాహన కల్పించారు. యంత్రసాయంతో వరినాట్లు వేసుకోవడం ద్వారా కూలీల పెట్టుబడులు తగ్గి, సమయం ఆదా అవుతుందన్నారు. అధిక దిగుబడులు కూడా వస్తాయన్నారు. సంప్రదాయ పద్ధత్తుల్లో వరినాట్లు వేసేవారు నారు కొనలు తొలగించి, వేసుకోవాలని సూచించారు. ఇలా చేయడం ద్వారా నారు ద్వారా సోకే తెగుళ్ల పంటకు సోకవన్నారు. అలాగే పంట ఏపుగా పెరుగుతుందన్నారు.

అదనపు ఉపాధ్యాయులను నియమించండి

తెర్లాం: మండలంలోని విజయరాంపురం యూపీ స్కూల్‌కు అదనంగా ఉపాధ్యాయులను నియమించాలని సర్పంచ్ బూరి మధుసూదనరావు కోరారు. ఇదే విషయమై ఆయన ఎంఈఓ త్రినాథరావును సోమవారం కలిశారు. గ్రామంలోని స్కూల్‌లో 1 నుంచి 8 తరగతులకు కేవలం ఆరుగురు ఉపాధ్యాయులు మాత్రమే ఉన్నారని, సరిపడ సిబ్బంది లేకపోవడంతో విద్యాబోధనకు ఉపాధ్యాయులు ఇబ్బందులు పడాల్సి వస్తోందని తెలిపారు. స్పందించిన ఎంఈఓ ఈ సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్తానని హామీ ఇచ్చారు.

పంద్రాగస్టు ఆటల పోటీలు

తెర్లాం: స్వాతంత్య్ర దినోత్సవం(పంద్రాగస్టు) పురస్కరించుకుని, మండలంలోని అన్ని గ్రామాల ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల మధ్య ఆటల పోటీలు నిర్వహిస్తున్నారు. కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ తదితర పోటీలను వ్యాయామ ఉపాధ్యాయుల పర్యవేక్షణలో చేపడుతున్నారు. విజేతలకు ఆగస్టు 15వ తేదీన జరిగే స్వాతంత్ర్య దినోత్సవంలో బహుమతులు అందజేయనున్నారు.

ఘనంగా జాతీయ చేనేత దినోత్సవం

సంతకవిటి: మండలంలోని మందరాడ గ్రామ జెడ్పీ ఉన్నత పాఠశాలలో జాతీయ చేనేత దినోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. ప్రధానోపాధ్యాయుడు ఉరిటి రవిశంకర్ ఏటా ఆగస్టు 7వ తేదీన జరిగే ఈ దినోత్సవం ప్రాముఖ్యతను వివరించారు. చేనేత అనేది భారత స్వాతంత్ర్యోద్యమంలో ప్రధాన భూమిక పోషించిందని, స్వాతంత్ర్య సముపార్జనకు ఇది కూడా ఒక సాధనంగా నిలిచిందని తెలిపారు. అనంతరం విద్యార్థుల క్షేత్ర పర్యటనలో భాగంగా సోషల్ టీచర్ జి.అప్పలనాయుడు ఆధ్వర్యంలో గ్రామంలోని చేనేత కార్మికుల ఇంటికి విద్యార్థులను తీసుకువెళ్లి, చేనేత వస్త్రాల తయారీ, చేనేతకు వాడుతున్న ముడి పదార్థాలు, వారు తయారు చేసే డిజైన్లను చూపించారు.

గద్దర్‌కు ఘననివాళి

వంగర: మండల కేంద్రంలో పలు ప్రజాసంఘాల ఆధ్వర్యంలో సోమవారం జరిగిన కార్యక్రమంలో ప్రజాగాయకుడు గద్దర్(గుమ్మడి విఠల్‌రావు) మృతి పట్ల సంతాపం ప్రకటిస్తూ ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి, ఘననివాళులర్పించారు. అనంతరం ఆయన పోరాట పటిమ, ఆయన పాటలతో ప్రజలను చైతన్యం చేసిన తీరును వక్తలు వివరించారు. కార్యక్రమంలో ప్రజా సంఘాల నేతలు ఎం.గణపతి, డి.రాంబాబు, కె.రవి, టి.సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

తల్లిపాలు అమృతం



రేగిడి: ఉంగరాడమెట్ట ఆదర్శ అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహిస్తున్న తల్లిపాల వారోత్సవాలు



బొబ్బిలి 14వ వార్డులో గర్భిణులకు సీమంతం చేస్తున్న దృశ్యం

బొబ్బిలి, రాజాం నియోజకవర్గాల్లోని ప్రతీ గ్రామంలో తల్లిపాల వారోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. కార్యక్రమంలో భాగంగా వైఎస్సార్ సంపూర్ణ పోషణ పథకం కింద గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహార కిట్లు అందజేస్తూ తల్లిపాల ఆవశ్యకతను వివరిస్తున్నారు. సోమవారం జరిగిన కార్యక్రమంలో పలువురు వక్తలు మాట్లాడుతూ తల్లిపాలు బిడ్డకు అమృతం వంటిదని, అనేక పోషక విలువలుంటాయని తెలిపారు. అప్పుడే పుట్టిన బిడ్డకు కొన్నాళ్ల పాటు తల్లిపాలు ఇస్తే బిడ్డకు సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందన్నారు. ప్రభుత్వం పంపిణీ చేసిన పౌష్టికాహారంను సద్వినియోగం చేసుకుని, ఆరోగ్యంగా ఉండి, పిల్లలను కూడా ఆరోగ్యంగా ఉంచాలని కోరారు.

–సాక్షి నెట్‌వర్క్



వంగర: కొట్టిశలో గర్భిణులు, బాలింతలకు ఇచ్చే పౌష్టికాహారం ప్రదర్శన



సంతకవిటిలో తల్లిపాల ఆవశ్యకతను వివరిస్తున్న అంగన్‌వాడీ సూపర్‌వైజర్ రత్నం

10 నుంచి నులిపురుగులు నులిమేద్దాం

- కార్యక్రమ పోస్టర్ ఆవిష్కరణలో ఎంపీడీఓ బాసూరి శంకరరావు



రాజాం సిటీ: నులిపురుగుల నివారణ దినోత్సవ వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎంపీడీఓ శంకరరావు, వైద్యులు



బొబ్బిలి: ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేస్తున్న మున్సిపల్ చైర్మన్, మున్సిపల్ కమిషనర్



రామభద్రపురం: వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎంపీడీఓ రమామణి

రాజాం సిటీ: రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 10వ తేదీన ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టనున్న నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని విజయవంతం చేయాలని ఎంపీడీఓ బాసూరి శంకరరావు కోరారు. సోమవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో బొద్దాం పీహెచ్‌సీ వైద్యులు నరేంద్ర, సిద్ధేశ్వరి ఆధ్వర్యంలో ఏఎన్‌ఎంలు, ఆశ కార్యకర్తలతో సమావేశమైన ఆయన కార్యక్రమ నిర్వహణపై దిశానిర్దేశం చేశారు. బొద్దాం పీహెచ్‌సీ పరిధిలో 33 ప్రభుత్వ పాఠశాలలు, రెండు ప్రైవేటు పాఠశాలలు, 50 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయని, వీటిలో 2 నుంచి 19 ఏళ్ల మధ్య వయసు వారందరికీ నులిపురుగు నివారణ మాత్రలు వేయాలని తెలిపారు. అనంతరం కార్యక్రమానికి సంబంధించిన వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎంఈఓ ప్రవీణ్‌కుమార్, సీడీపీఓ కనకదుర్గ తదితరులు పాల్గొన్నారు.

బొబ్బిలి: స్థానిక మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ చైర్మన్ ఎస్వీ మురళీకృష్ణారావు, మున్సిపల్ కమిషనర్ ఎస్.శ్రీనివాసరావుల చేతుల మీదుగా వైద్యారోగ్య సిబ్బందికి నులిపురుగుల నివారణకు సంబంధించి, ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ నెల 10వ తేదీన జరిగే నులిపురుగుల నివారణ దినోత్సవం నాడు రెండు నుంచి 19 ఏళ్ల మధ్య వయసు పిల్లలందరికీ ఈ మాత్రలు వేయాలని సూచించారు.

రామభద్రపురం: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఈ నెల 10వ తేదీన నిర్వహించే జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవానికి సంబంధించి, రూపొందించిన వాల్‌పోస్టర్‌ను సోమవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రమామణి ఈఓపీఆర్డీ వెంకటరమణ, వైద్యారోగ్య సిబ్బంది పాల్గొన్నారు.